ఆంధ్రజ్యోతి
**
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
బుధవారం 7 ఫిబ్రవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	178	203
సూర్యాపేట	రూ.136	196	223
నల్లగొండ	రూ.136	196	223

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.0 । కనిష్ఠం 21.0

నల్లగొండ నుంచే కేసీఆర్ కృష్ణాజల ఉద్యమం



గత ఏడాది నవంబరు 30న ఏపీ ప్రభుత్వం సాగర్ డ్యాంపై ఏర్పాటుచేసిన కంచె, బ్యారికేడ్లు(ఫైల్)

రాజకీయపురిటి గడ్డ నల్లగొండ నుంచే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో ప్రజాఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు. గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం, అనారోగ్యకారణాలతో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక క్రియాశీలక రాజకీయాలకు కొన్నాళ్లు దూరంగా ఉన్న మాజీ సీఎం కేసీఆర్ ప్రతిపక్ష పాత్రను నల్లగొండ నుంచే ప్రారంభించనున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

కృష్ణాజలాల్లో రాష్ట్ర హక్కుల సాధన పోరాటాన్ని ఎంచుకున్న కేసీఆర్ ఈ అంశంపై తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఈనెల 13న నల్లగొండలో కృష్ణాజలాల పరిరక్షణ సభ నిర్వహించాలని నిర్ణయించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన నల్లగొండ ఉమ్మడి జిల్లా కీలక నేతల సమావేశంలో కేసీఆర్ ఈ మేరకు సభ నిర్వహణపై మార్గనిర్దేశం చేశారు. లోక్‌సభ ఎన్నికల ముంగిట రాజకీయచైతన్యం కలిగిన నల్లగొండ నుంచే కేసీఆర్ కృష్ణాజలాల ఉద్యమం చేపట్టడం రాజకీయంగా ఆసక్తి రేకెత్తిస్తోంది.

కృష్ణానది జలాల్లో హక్కుల సాధనే ప్రధాన ఎజెండా

కృష్ణానది జలాల పరిరక్షణ సభ పేరుతో ఈనెల 13న మధ్యాహ్నం 3గంటలకు నల్లగొండలో బీఆర్ఎస్ నిర్వహించనుంది. కృష్ణాజలాల్లో రాష్ట్ర హక్కులు సాధించడమే ఈ సభ ప్రధాన ఎజెండా. కేంద్రం ఆధీనంలోని కేఆర్ఎంబీ (కృష్ణానది యాజమాన్య బోర్డు) పరిధిలోకి నాగార్జునసాగర్ ప్రాజెక్టు వెళ్లకుండా నిరోధించాలని, ఒక్కసారి కేంద్రం పరిధిలోకి ప్రాజెక్టులు వెళ్తే తాగునీటి అవసరాలకు సైతం నీటిని వినియోగించుకోలేని దయనీయస్థితి ఉంటుందనేది బీఆర్ఎస్ వాదన. అదేవిధంగా నీరు అందుబాటులో ఉన్నప్పుడు, రైతులకు అవసరమైనప్పుడు సాగునీరు విడుదల చేసే అంశం కూడా రాష్ట్రం పరిధిలో ఉండదని, ఈఅంశాలపై రైతులను, ప్రజలను చైతన్యం చేయడానికే సభ నిర్వహించాలని కేసీఆర్ తలపెట్టినట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.రాజకీయ కోణంలో కాకుండా రైతుల ప్రయోజనాల కోణంలోనే ఈ సభను చూడాలని, పార్టీలకు అతీతంగా సభకు రైతులు రావాలని నేతలు కోరుతున్నారు.

లోక్‌సభ ఎన్నికల ముందు

లోక్‌సభ ఎన్నికల ముందు కృష్ణాజలాల హక్కుల అంశాన్ని బీఆర్ఎస్ తెరపైకి తేవడంతో ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ కృష్ణానీటి విడుదల కోసం, ప్రాజెక్టుల సాధన కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాదయాత్రలు, సభలు ఉమ్మడి జిల్లాలో కొనసాగాయి. తాజాగా, ప్రతిపక్షంలోకి వచ్చాక మరోసారి కీలకమైన నదీజలాల అంశాన్నే బీఆర్ఎస్ ముందుకుతేవడంతో వచ్చే ఎన్నికల్లో ఈ అంశమే రాజకీయ ఎజెండా కానుందని తెలుస్తోంది. ఈ సభను విజయవంతం చేసేందుకు అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా రైతులు తరలివచ్చేలా మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు రంగంలోకి దిగుతున్నారు. సభను విజయవంతం చేయడం ద్వారా కృష్ణాజలాల అంశాన్ని బలంగా జనంలోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు.

- 13న భారీ సభ
- ప్రతిపక్ష నేతగా తొలిసభ నిర్వహణకు సిద్ధం



కేసీఆర్ నల్లగొండకు వస్తే ప్రజలు తిరగబడతారు

కేసీఆర్ నల్లగొండకు వస్తే ప్రజలు తిరగబడి తరిమి కొడతారు. ఇక్కడి ప్రజల రక్తం మరుగుతోంది, కేసీఆర్ బస్సులో వచ్చినా, మిలటరీని పెట్టుకుని వచ్చినా ఆయన ఇక్కడ అడుగు పెట్టలేరు. ప్రాజెక్టులను సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి అప్పగించారని చెప్పడానికి కేసీఆర్‌కు సిగ్గుండాలి. మేం వచ్చి రెండు నెలలు కాలేదు. ప్రాజెక్టులు అప్పగించేందుకు ఎవరితో కుమ్మకు అయ్యామో చెప్పాలి. కేసీఆర్ హయాంలోనే ప్రాజెక్టులన్నీ కేఆర్ఎంబీకి అప్పగించారు. కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రాకు 512 టీఎంసీలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఆ రోజు పెద్ద తప్పు చేయడంతోనే దక్షిణ తెలంగాణలోని మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో తాగునీరు లేని పరిస్థితులకు కేసీఆరే కారణం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 11వేల క్యూసెక్కులు నుంచి 44వేల క్యూసెక్కులు ఆంధ్రాకు తరలించుకుపోగా, జగన్మోహనరెడ్డి సీఎం అయ్యాక 88వేల క్యూసెక్కులు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి తరలించుకుపోయేలా డిజైన్ రూపొందించారు. శ్రీశైలం ప్రాజెక్టులో 795అడుగుల నీరు(డెడ్ స్టోరేజీకి చేరువ) ఉన్నప్పుడు బురద నీటిని కూడా తీసుకెళ్లడానికి మాజీ సీఎం కేసీఆరే కారకుడు. కుర్చీ వేసుకుని కూర్చుని ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తానన్న కేసీఆర్ ఒక్కసారి కూడా ఆ ప్రాజెక్టుపై సమీక్ష చేయలేదు. ఉత్తర తెలంగాణలో కాల్వలకు లైనింగ్ చేయించుకున్న కేసీఆర్ దక్షిణ తెలంగాణలోని ప్రాజెక్టులోని కాల్వలు మాత్రం పట్టించుకోలేదు. నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో సబ్ కాంట్రాక్టర్‌గా మారి వందల కోట్లు దోచుకున్నాడు. ఆయన ఆస్తులపై డ్రోన్ కెమెరాలతో రికార్డు చేయించి త్వరలో బండారం బయట పెడతాం.

- నల్లగొండలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ప్రజలను మేల్కొలిపేందుకే సభ

కృష్ణాజలాల్లో తెలంగాణ హక్కులపై, కేంద్రం పరిధిలోకి ప్రాజెక్టులు వెళ్తే భవిష్యత్‌లో ఎదుర్కొనే ఇబ్బందుల పై ప్రజలకు అవగాహన కల్పించి, వారిని మేల్కొలిపేందు కే బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించాం. రైతుల ప్రయోజనాలే తప్ప ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహనారాహిత్యంతో, తెలివి తక్కువతనంతో తప్పులపై తప్పులు చేస్తూ రాష్ట్ర ప్రయోజనాల కు నష్టం కలిగిస్తోంది. వాళ్లు ఇప్పటికైనా అహంభావం వీడి సీనియర్లను సంప్రదించి కృష్ణాజలాల్లో రాష్ట్ర హక్కులు సాధించడానికి ఏం చేయాలో ఆలోచించాలి. ఈ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. పార్టీలకు అతీతంగా రైతులు సభకు తరలిరావాలి.

- గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి, మాజీమంత్రి



జిల్లాలో నెల రోజులు 30, 30(ఎ) యాక్ట్

జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల పాటు 30, 30 (ఎ) పోలీస్ యాక్ట్-1861 అమలులో ఉంటుందని ఎస్పీ చందనా దీప్తి మంగళవా రం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారు ల ముందస్తు అనుమతి లేనిది ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించేలా, ప్రజాధనానికి నష్టం కలిగిం చేలా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు,ప్రజా ప్రతి నిధులు, ప్రజా సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు.

ఎడమకాల్వ మేజర్లకు నీటి విడుదల నిలిపివేత



డిస్ట్రిబ్యూటరీ నుంచి నిలిచిన నీటి విడుదల

ఆయకట్టు రైతుల ఆశలకు గండి

నిడమనూరు, ఫిబ్రవరి 6: సాగునీ టి విడుదలపై ఆయకట్టు రైతులకు నిరాశే ఎదురైంది. వారం రోజులపాటు నీటిని విడుదల చేస్తే పొలాలు కాపాడుకోవచ్చనుకున్న రైతుల ఆశలకు అధికారులు గండికొట్టారు. మేజర్ కాల్వలకు నీటి విడుదల కేవలం రెండు రోజుల మురిపెంగానే మిగిలింది. కనీసం ఐదు రోజులు నీటి విడుదల ఉంటుందని రైతులు భావించారు. కానీ, రెండు రోజులకే నీటి విడుదలను నిలిపివేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని ముదిమాణిక్యం, నారెళ్లగూడెం మేజర్లకు మంగళవారం ఉదయం నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌ను నింపేందుకు ఈనెల 9వరకు సాగర్ ప్రధానకాల్వకు నీటిని విడుదల కొనసాగనుంది. అయితే ఎండుతున్న పొలాలను కాపాడుకునేందుకు రైతులు మేజర్ల వద్ద ఆందోళన చేస్తుండటంతో, ప్రజాప్రతినిధులు, రైతుల విజ్ఞప్తి మేరకు మేజర్లకు కూడా నీటిని విడుదల చేశారు. దీంతో ఎండుతున్న పొలాలు కాపాడుకోవచ్చని ఆశించారు. పంట కాల్వలు సక్రమంగా లేకపోవడంతో చివరి భూములకు ఇంకా నీరు చేరలేదు. మరో మూడు రోజులపాటు నీటి విడుదల ఉంటుందనే రైతులు ఆశపడ్డారు.

ప్రధాన కాల్వకు 9వరకు నీటి విడుదల ఉంటున్నందున మేజర్లకు కూడా అప్పటి వరకు నీటిని విడుదల చేస్తారని భావించారు. కానీ, సూర్యాపేట జిల్లాలోని భూములకు నీరు అందడం లేదనే ఉద్దేశంతో మేజర్ కాల్వలకు నీటి విడుదలను తక్షణ మే నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రా వడంతో మంగళవారం ఉదయమే అధికారులు మేజర్లకు నీటిని నిలిపారు. దీంతో ఆయకట్టు రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. షట్టర్లను ఎత్తి రైతులే నీటిని విడుదల చేసుకునే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో మేజర్ల వద్ద రాత్రివేళ అధికారులు, పోలీసులు కాపలా కాస్తున్నారు. ఇటీవల ముదిమాణిక్యం మేజర్‌కాల్వ వద్ద సాగునీటి కోసం నిడమనూరు, త్రిపురారం, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల రైతులు ఆందోళన చేసిన విషయం విదితమే.ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు నీటి విడుదల నిలిపివేశామని ఎన్నెస్పీ అధికారులు చెబుతున్నారు.

విద్యార్థినుల ఆత్మహత్యల

మిస్టరీని తేల్చండి

భువనగిరిలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించిన రాజకీయ ప్రముఖులు

హాస్టల్‌ను పరిశీలించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో.. ఎస్ఎఫ్ఐ నిరసన

•7లో..



హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కొండపై తికమక

- భక్తులకు అందని సేవల వివరాలు
- మాస్టర్‌ప్లాన్‌లో కనిపించని డోనర్ సెల్ కౌంటర్
- ప్రచారశాఖ ప్రదేశం కౌంటర్ వద్దా?



కొండపైన తిరవీధుల్లో భక్తులు(ఫైల్)

శరణు 3

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 6: స్వయంభూ పాంచ నారసింహకొండపై సేవల వివరాలు తెలిసేదెలా? అని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ఉద్ఘాటన అనంతరం హరిహరులను దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు కొండపై ఎదుర్కొంటున్న ఇబ్బందులు అనేకం ఉన్నాయి. కొండకింద బస్టాండ్‌లో దిగినప్పటినుంచి భక్తుల యాతనలు ఆరంభమవుతున్నాయి. గండిచెరువు సమీపంలోని బస్టాండ్‌లో దిగితే బస, వసతి సౌకర్యాలకోసం కిలోమీటర్ల మేర కొండకిందకు తిరిగి రావాల్సి ఉంటుంది. కేవలం దర్శనాల కోసమైతే బస్సు దిగిన వెంటనే టెంపుల్ బస్ టెర్మినల్‌లో కొండపైకి బస్సులు సిద్ధంగా ఉంటాయి. ఇక్కడే ఉన్న కల్యాణకట్టలో తలనీలాలు అందజేసి లక్ష్మీపుష్కరిణిలో స్నానాలు ఆచరించి కొండపైకి వెళ్లాలి. అయితే కొత్తగా కొండకు వచ్చిన భక్తులకు ఇవేమీ తెలియక, చెప్పేవారు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొండపైకి వచ్చినా ఎక్కడా సూచీబోర్డులు, భక్తులకు సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు విచారణ కార్యాలయం సైతం లేవు. యాదగిరీశుడి సన్నిధిలో భక్తులు అధికసంఖ్యలో శాశ్వత కైంకర్యాల టికెట్లు పొందుతారు. భక్తులు తమకు అనుకూలమైన, విశేష రోజుల్లో ఆయా ఆర్జిత సేవలను నిర్వహించుకునే అవకాశం ఉంటుంది. అయితే ఈ సేవను పొందేందుకు భక్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత పూజల వివరాలు తెలియజేసేందుకు శాశ్వత కార్యాలయాన్ని కొండపైన నిర్మించకపోవడమే ఈ దుస్థితికి కారణమైంది. అదేవిధంగా సెంట్రల్ బుకింగ్ కౌంటర్, వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి, స్వామివారి ఫోటోలు, క్షేత్ర చరిత్రను తెలియజేసే పుస్తకాలు విక్రయించే ప్రచారశాఖ, విచారణ కార్యాలయాల భవనాలు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని మరింత బహిర్గతం చేస్తోంది. యాదగిరికొండకు విచ్చేసే భక్తులు పొందాల్సిన కనీస సౌకర్యాలనే విస్తరణ పర్వంలో మరవడం పట్ల భక్తులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాస్టర్ ప్లాన్‌లో కనిపించని డోనర్ సెల్ కౌంటర్

యాదగిరీశుడి దర్శనాల అనంతరం భక్తులు శాశ్వత మొక్కు, పూజా టికెట్లు, అన్న ప్రసాదాలు తదితర విభాగాలకు విరాళాలు అందజేసేందుకు ఆసక్తి చూపుతారు. అలాంటి పూజల కార్యాలయం(డోనర్ సెల్ కౌంటర్)కోసం యాదాద్రి ఆలయ మాస్టర్‌ప్లాన్‌లో ఎలాంటి ప్రణాళికలు పొందుపరచకపోవడం గమనార్హం. స్వామికి భక్తులు హుండీల ద్వారానే కాకుండా విరాళాల రూపంలోనూ నగదు, నగలను అందజేస్తుంటారని తెలిసినా, అధికారులు మాస్టర్‌ప్లాన్‌లో విస్మరించడం గమనార్హం. నిజాం పరిపాలనా సమయం నుంచే విరాళాల సేకరణకు కొండపైన ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉండేవి. ఆదాయ వనరులు సమకూర్చే విభాగాల్లో శాశ్వత పూజల కార్యాలయానిది సింహభాగం. ఈ విభాగం లేకపోవడంతో ఆలయ పునర్నిర్మాణంపై కనీస అవగాహనలేని వ్యక్తులకు పనులు అప్పగించారని భక్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. శాశ్వత కార్యాలయ నిర్మాణాన్ని అధికారులు ఎలా మరిచారని భక్తులు వాపోతున్నారు. కనీసం ఆలయ పునర్నిర్మాణం పూర్తయిన తర్వాతనైనా శాశ్వత పూజల కార్యాలయానికి శాశ్వత భవనం కోసం ఏర్పాట్లు చేపట్టకపోవడంపై మండిపడుతున్నారు. పదుల సార్లు సీఎం, సీఎంవో సెక్రటరీతో పాటు వైటీడీఏ అధికారులు ఆలయ పునర్నిర్మాణ పనులను పర్యవేక్షించిన తరుణంలో కొండపైన శాశ్వత పూజల కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మాణం గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడంపై కొండపైన ఏ నిర్మాణం ఎక్కడ ఉండాలనే సునిశిత అంశాన్ని మరిచినట్లు తేటతెల్లమవుతోంది. ఇక ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ఈ శాశ్వత పూజల కార్యాలయం తాత్కాలికంగా బాలాలయం నుంచి బయటకు వచ్చే దారిలో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తాత్కాలిక బాలాలయం నిర్మాణ సమయంలో గుర్తించిన అధికారులు శాశ్వత కట్టడాలు పూర్తయ్యాక కూడా విస్మరించారని విమర్శలు వినిపిస్తున్నాయి. శాశ్వత పూజల కార్యాలయం అవసరాన్ని గుర్తించిన అధికారులు అష్టభుజి ప్రాకార పడమటి దిశలో తాత్కాలిక ఏర్పాట్లతో డోనర్ సెల్ ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది.

ప్రచారశాఖ ప్రదేశం కౌంటర్ వద్దా?

యాదగిరికొండపైన స్వామివారి ఫొటోలు, క్షేత్ర మహత్యాన్ని తెలియజేసే గ్రంథాలతో పాటు ఇతర ఆధ్యాత్మిక పుస్తకాలు, స్వామివారి బంగారు, వెండి లాకెట్‌లు, క్యాలెండర్ తదితరాలను తొలి నాళ్లనుంచే ప్రచారశాఖ కౌంటర్ ద్వారా భక్తులకు విక్రయిస్తున్నారు. అటువంటి ప్రచారశాఖ కౌంటర్‌కు కొండపైన సరైన ప్రదేశమే లేదంటే ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ కౌంటర్ ద్వారా సైతం దేవస్థానానికి ఆదాయం సమకూరుతుందని తెలిసినా అధికారులు ఆలయ పునర్నిర్మాణంలో మరిచిపోవడం విశేషం.

'పది'లో వందశాతం ఫలితాలు సాధించాలి

కలెక్టర్ ఎస్. వెంకట్రావ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వందశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకంజలో ఉన్నారో గుర్తించి వారికి ప్రత్యేకంగా బోధించాలన్నారు. విద్యాశాఖాధికారులు నిరంతరం వసతి గృహాలను తనిఖీలు చేయాలన్నారు. విద్యార్థులకు పరీక్షలంటే భయం లేకుండా మానసికంగా సిద్ధం చేయాలన్నారు. హైదరాబాద్ రోబోటిక్స్ అకాడమీ కింద జిల్లాలో కోదాడలోని జడ్పీహెచ్ఎస్ బాలికల, సూర్యాపేటలోని జడ్పీహెచ్ఎస్, బాలికల ఉన్నత పాఠశాల, ఎంఏఎం ఉన్నత పాఠశాల, గండూరి జానకమ్మ మెమోరియల్ పాఠశాల, కుడకుడలోని జడ్పీహెచ్ఎస్, చివ్వెంల కేజీబీవీ పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు. ఎంపికైన పాఠశాలల్లోని విద్యార్థులకు రోబోటిక్స్ అకాడమీ ద్వారా నాణ్యమైన విద్యనందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఈవో అశోక్‌తో పాటు వివిధ మండలాల విద్యాధికారులు ఉన్నారు.

ప్రతీ ఉద్యోగి ఐటీ టీడీఎస్ చేయించుకోవాలి

జిల్లాలోని వివిధ ప్రభుత్వశాఖల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు విధిగా టీడీఎస్ చేయించుకోవాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆదాయపు పన్ను టీడీఎస్ వర్క్‌షాప్‌లో మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి ముందుగానే ఆదాయ పన్నును 12 నెలలుగా విభజించి ప్రతీనెల వేతనం ద్వారా ఆదాయ పన్నుశాఖకు చెల్లించి అనంతరం ప్రతీ మూడునెలలకు టీడీఎస్ చేయించుకోవాలన్నారు.ఆదాయ పన్ను చెల్లించి టీడీఎస్ చేయించుకోకపోతే రోజుకు రూ.200చొప్పున అపరాధరుసుముకు సంబంధించిన నోటీసులు అందజేస్తారన్నారు.సమావేశంలో జడ్పీ సీఈవో సురేష్‌కుమార్, హైదరాబాద్ ఆదాయ పన్ను శాఖ అధికారులు రంజన్‌బెహ్రా, పౌలియన్ హంగ్, డీటీవో రవికుమార్, ఐటీవో ప్రకాష్‌వర్మ, ఏటీవోలు అనిల్‌కుమార్, శ్రీనివాస్, ఎస్‌టీవోలు కిరణ్, వీరేందర్ పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ వెంకట్రావ్



కోదాడలో ఆస్పత్రిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

హుజూర్‌నగర్, కోదాడ టౌన్, కోదాడ రూరల్, ఫిబ్రవరి 6: హుజూర్‌నగర్ పట్టణంలోని 100 పడకల ఆస్పత్రి అప్‌గ్రేడ్ చేసే విషయమై పరిశీలించేందుకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు బుధవారం రానున్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డీఎస్పీ ప్రకాశ్‌యాదవ్‌లు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని, జూనియర్ కళాశాలలో హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో రివ్యూ మీటింగ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రుల పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమాల్లో ఆర్డీవో జగదీశ్వరరెడ్డి, కమిషనర్ శ్రీనివా‌స్‌రెడ్డి, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, తన్నీరు మల్లికార్జున్‌రావు, సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అదే విధంగా కోదాడ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు మంత్రులు రానున్నారని స్థానిక కాంగ్రెస్ నేతలు తెలిపారు. మధ్యాహ్నం 12.45 గంటలకు కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారని, అక్కడ భోజన విరామ సమయం తర్వాత 3.15 గంటలకు పట్టణంలోని 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన అనంతరం వైద్యశాలలో మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించనున్నారని వివరించారు. కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేయనుండగా, అందుకు సంబంధించిన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పరిశీలించారు.

సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి



హాజరైన ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీజీపీ రవిగుప్తా

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 6: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీజీపీ రవిగుప్తా జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఎస్పీతోపాటు ఇతర పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సైబర్ మోసాలకు ప్రజలు గురికాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలను చేధించాలని సూచించారు. మహిళలు, విద్యార్థినుల రక్షణ విషయంలో రాజీ లేకుండా పోలీసింగ్ చేయాలన్నారు. అనంతరం ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే మాట్లాడుతూ సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, విద్యార్థినుల రక్షణ విషయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ప్రతీ పనిపై డీఎస్పీ, సీఐ స్థాయి అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టామన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు పరిక నాగభూషణం, ప్రకాష్, జి.రవి, శ్రీనివాసరావు, సీఐలు రాజేష్, శివశంకర్, వీరరాఘవులు, అశోక్‌రెడ్డి, బ్రహ్మమురారి, రాము, రామలింగారెడ్డి, లక్ష్మీనారాయణ, ఎస్ఐలు వెంకటరెడ్డి, అవిలయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడి సన్నిధిలో ఏకాదశి లక్షపుష్పార్చనలు

● క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 6: ఏకశిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మంగళవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా లక్షపుష్పార్చన పూజలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులను పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి స్వర్ణసింహాసనంపై అధిష్ఠింపజేశారు. స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో అర్చకస్వాములు, వేదపండితులు వివిధ రకాల పుష్పాలతో లక్షపుష్పార్చన పూజలు చేశారు. సుమారు రెండు గంటలపాటు పుష్పార్చన పర్వాలు కొనసాగగా.. పుష్పార్చనలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు, ఆశీస్సులు అందజేశారు. ప్రాకార మండపంలో హోమం, నిత్య తిరుకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా క్షేత్రపాలకుడు ఆంజనేయుడికి విశేషపూజలు కొనసాగాయి. కొండపైన ప్రధానాలయం, విష్ణు పుష్కరిణి, శివాలయం, పాతగుట్ట ఆలయాల్లోని ఆంజనేయస్వామిని కొలుస్తూ అర్చకులు వేదమంత్రపఠనాలతో అభిషేకించి నాగవల్లీదళాలతో అర్చించారు. శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యారాధనలు, యాగశాలలో నిత్యరుద్రహవనం స్మార్త సంప్రదాయరీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.17,70,079 ఆదాయం సమకూరిందని, సుమారు 10వేల మందికి పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించినట్లు అధికారులు తెలిపారు.



యాదగిరిగుట్ట ప్రధానాలయంలో లక్ష్మీనృసింహుడికి లక్షపుష్పార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ఆర్‌ఆర్‌ఆర్‌లో భూమి పోతుందని మనస్తాపం

● గుండెపోటుతో రైతు కన్నుమూత
● యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఘటన


నర్సిరెడ్డి (ఫైల్ ఫొటో)

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 6: రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణంలో భూమి కోల్పోతున్నామనే మనస్తాపంతో ఓ రైతు గుండె ఆగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెం గ్రామానికి చెందిన మామిడి నర్సిరెడ్డి (70)కి గ్రామపరిధిలో ఎనిమిది ఎకరాల్లో వరి సాగుచేస్తున్నాడు. ఐదు దశాబ్దాలుగా తన భూమిని సాగుచేసుకుంటూ కుమారుడు, కుమార్తెలకు వివాహాలు చేశాడు. కుమారుడు, భార్యతో కలిసి ఇంట్లోనే ఉంటున్నాడు. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంలో భాగంగా మొదటి దశలో గజ్వేల్ నుంచి చౌటుప్పల్ వరకు భూమిని సేకరించేందుకు ఏడాది క్రితం నోటిఫికేషన్ జారీచేశారు. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంలో మందోళ్లగూడెం గ్రామానికి చెందిన 15మంది రైతుల భూములు ఉన్నాయి. అందులో నర్సిరెడ్డికి చెందిన ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి నర్సిరెడ్డి మనోవేదన చెందుతూనే ఉన్నాడు. ఎక్కడ ఆర్‌ఆర్‌ఆర్ బాధితుల సమావేశాలు నిర్వహించినా నర్సిరెడ్డి హాజరయ్యేవాడు. ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని సహచర రైతులతో కలిసి అధికారులను, ప్రజాప్రతినిధులను కలిశాడు. భూసేకరణలో భాగంగా సోమవారం అటవీశాఖ అధికారులు నర్సిరెడ్డి పొలంలో చెట్లను లెక్కించారు. ఆర్‌ఆర్‌ఆర్‌లో భూమి త్వరలో పోతుందని ఫారెస్టు అధికారులు చెప్పడంతో ఒక్కసారిగా దిగ్ర్భాంతికి గురయ్యాడు. ఆరుగాలం శ్రమించి కష్టపడి సంపాదించిన తన భూమి తన కళ్లెదుటే పోతుందని గ్రహించి, తీవ్ర మనస్తాపానికి గురై ఇంటికి వచ్చి కుప్పకూలిపోయాడు. అదే మనోవేదనతో ఉదయం నుంచి రాత్రి వరకు ఏమీ తినకుండా ఉండి మంచంలోనే కన్నుమూశాడు. భూమి కోల్పోతుండటంతోనే నర్సిరెడ్డి మృతిచెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. నర్సిరెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయలేదని మందోళ్లగూడెం మాజీ సర్పంచ్ బూరుగు కళమ్మ తెలిపారు.

పట్టభద్రుల ఓటుకు 4.30లక్షల దరఖాస్తులు

● గతంతో పోలిస్తే 70వేలు తగ్గిన ఓటర్లు
● వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్ర ఓటర్లకు ముగిసిన దరఖాస్తులు

నల్లగొండ, ఫిబ్రవరి 6: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి మంగళవారం సాయంత్రం వరకు ఓటు నమోదుకు 4.30లక్షలు దరఖాస్తులు వచ్చాయి. వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో ఎలక్షన్ సెల్‌ను ఏర్పాటుచేయగా, జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు 4.30లక్షల దరఖాస్తులు వచ్చినట్లు ఎలక్షన్ సెల్ అధికారి సమాచారమిచ్చారు. రాత్రి 12గంటల వరకు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండటంతో ఈ మూడు జిల్లాల్లో మరికొన్ని దరఖాస్తులు పెరిగే అవకాశాలున్నాయి. మంగళవారంతో దరఖాస్తుల గడువు ముగిసినప్పటికీ ఓటు నమోదుకు మళ్లీ గడువు పెంచుతారా? లేదా? చూడాల్సి ఉంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో 5.05లక్షల ఓటర్లు ఉండగా ఈసారి 70వేలకుపైగా ఓటర్లు తగ్గారు. గతంలో ఓటు వేసిన వారు కూడా తిరిగి మళ్లీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని, లేదంటే ఓటు హక్కు ఉండదని ఎన్నికల సంఘం ప్రకటించింది. అయినప్పటికీ ఓటు నమోదు చేసుకోవడానికి చాలామంది పట్టభద్రులు ఆసక్తి చూపలేదు.

ఆత్మహత్యల మిస్టరీని తేల్చండి

● భువనగిరిలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించిన రాజకీయ ప్రముఖులు
● ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో
● ఎస్ఎఫ్ఐ నిరసన సమావేశం


విద్యార్థినుల ఆత్మహత్య ఉదంతంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని భువనగిరిలో రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 6 : భువనగిరి ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులు భవ్యశ్రీ, వైష్ణవిల ఆత్మహత్య ప్రకంపనలు కొనసాగుతున్నాయి. ఆత్మహత్యకు దారితీసిన మిస్టరీని తేల్చాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. హత్యలా, ఆత్మహత్యలా తేల్చాలని, అందుకు బాధ్యులైన వారిని గుర్తించి శిక్షించాలని ఆందోళనలు మిన్నంటాయి. ఈ ఘటనపై అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రముఖులతో పాటు పలువురు హాస్టల్‌ను సందర్శించి, ఇద్దరు బాలికలకు నివాళులర్పిస్తూనే వసతుల దుస్థితిని పరిశీలిస్తూ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం భువనగిరిలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేయగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన సమావేశం నిర్వహించారు.

ఆత్మహత్యలపై సమగ్ర దర్యాప్తు జరపాలి


హాస్టల్ పక్కన ఉన్న ఐటీఐ విద్యార్థినులతో మాట్లాడుతున్న కవిత

భవ్యశ్రీ, వైష్ణవి ఆత్మహత్యలపై అనుమానాలున్నాయి. ఉన్నత భవిష్యత్ కోసం హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న వారు అనుమానాస్పదంగా మృతి చెందడం బాధాకరం. ఒకే రూంలో ఆత్మహత్యకు పాల్పడి నాలుగు రోజులు గడుస్తున్నా సాక్ష్యాధారాలు లభించలేదని పోలీసులు పేర్కొనడం దారుణం. వెలుపలి వ్యక్తులు హాస్టల్‌లోకి ప్రవేశించినట్లు తల్లిదండ్రులు పేర్కొంటున్నా ఆ దిశగా అధికారులు విచారణ చేపట్టకపోవడం అమానుషం. అద్దె భవనంలో కొనసాగుతున్న హాస్టల్ దుస్థితి, విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినుల కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది. ప్రభుత్వం కూడా ఆయా కుటుంబాలకు న్యాయం చేయాలి.

● కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్సీ

ఘటనపై ప్రభుత్వం స్పందించాలి


హాస్టల్ గదిని పరిశీలిస్తున్న శిల్పారెడ్డి

విద్యార్థినుల జంట ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించి కుటుంబాల్లో ఆవేదన మిగిల్చిన భవ్యశ్రీ, వైష్ణవిలు ఆత్మహత్య చేసుకొని నాలుగు రోజులు గడుస్తున్నా పాలకులు చూపుతున్న నిర్లక్ష్యం బాలికల సంక్షేమంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై ప్రభుత్వం విఫలమైంది. పేద విద్యార్థులు మాత్రమే సంక్షేమ వసతి గృహాల నిర్వహణను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోంది. ఎలాంటి భద్రతా, రక్షణ లేని భువనగిరి వంటి హాస్టల్స్ రాష్ట్రమంతటా ఉన్నాయి. భువనగిరిలో విద్యార్థినుల ఆత్మహత్యలపై ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణ జరిపి దోషులను శిక్షించాలి. బాధిత కుటుంబాలను ఆదుకోవాలి.

● డాక్టర్ శిల్పారెడ్డి, బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు

విద్యార్థినులు పిరికివారు కాదు


హాస్టల్ గదిని పరిశీలిస్తున్న సంధ్య

భవ్యశ్రీ, వైష్ణవి క్లాస్ టాపర్స్ అని తమ హాస్టల్ పరిశీలనలో తేలింది. విద్యార్థినుల సమస్యలపై భవ్యశ్రీ వార్డెన్‌తో పాటు అధికారులను ప్రశ్నించేదని, ఆ అక్కసుతోనే ప్రాణ స్నేహితులైన ఇద్దరినీ అధికారులు, సిబ్బంది వేధించేవారని పలువురు అంటున్నారు. వారి ఆత్మహత్యలపై లోతైన విచారణ జరిపి అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులది. కానీ తమ పిల్లల ఆత్మహత్యలపై అనుమానాలు ఉన్నట్లు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులపై పోలీసులతో పాటు అధికారులు పూర్తిస్థాయిలో స్పందించకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

● సంధ్య, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు.

నిర్వహణ నిర్లక్ష్యంతో ప్రాణాలు బలి

హాస్టల్ నిర్వహణలో వార్డెన్‌తో పాటు సిబ్బంది, సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యమే భవ్యశ్రీ, వైష్ణవి ప్రాణాలను బలితీసుకున్నాయి. విద్యార్థినుల మానసిక స్థితిని గుర్తించి కౌన్సిలింగ్ చేయడంలో హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయులు విఫలమయ్యారు. దాంతో మనోవైదనకు గురై విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో తప్పనిసరిగా మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులతో మోటివేషన్ తరగతులు నిర్వహించాలి. జంట ఆత్మహత్యల కారకులను గుర్తించి, శిక్షించాలి. హాస్టల్ నిర్వహణలో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయాలను అరికట్టాలి. మితిమీరిన జోక్యంపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఉంటే విద్యార్థినుల ప్రాణాలు నిలిచేవి.

● ఝాన్సీ, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి

దోషులను కఠినంగా శిక్షించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి

భువనగిరిలో జంట ఆత్మహత్యల ఘటనకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలి. ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య చేసుకొని నాలుగు రోజులు గడుస్తున్నా హాస్టల్ వార్డెన్, సంబంధిత శాఖ అధికారులపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. విద్యార్థినుల ఆత్మహత్యకు కారకులెవరు, హాస్టల్ సిబ్బందిని కాపాడుతున్నదెవరో తేలాల్సి ఉంది. ఈ మేరకు ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తాం. ఆత్మహత్య చేసుకున్న భవ్యశ్రీ, వైష్ణవి పేద, బలహీన వర్గాలకు చెందిన వారు కావడంతోనే దర్యాప్తులో వేగం మందగించింది. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి.

● ఆర్ఎల్ మూర్తి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు

నమ్మకాన్ని నిలబెట్టేలా హాస్టళ్ల నిర్వహణ ఉండాలి

యాదాద్రి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టేలా హాస్టళ్ల నిర్వహణ ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగే హెచ్చరించారు. మంగళవారం కాన్ఫరెన్స్‌హాలులో ప్రభుత్వ హాస్టళ్ల వార్డెన్లు, సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో స్నేహపూర్వక వాతావరణంలో, ఆరోగ్యకరమైన అంశాలను పంచుకుని, విద్యార్థులకు గార్డియన్‌గా ఉండాలన్నారు.వెనుకబాటు ఉన్న విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వార్డెన్లు చేసే పని సేవాభావంగా భావించాలన్నారు. అబ్‌నార్మల్‌గా ఉన్న విద్యార్థుల విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపి ప్రత్యేకంగా మాట్లాడాలన్నారు. తరుచూ పేరెంట్స్‌తో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు ఇచ్చే ఫిర్యాదులపై అలక్ష్యం చేయవద్దని, ఫిర్యాదులను విచారించాలన్నారు. తీవ్రమైన ఫిర్యాదులను అసలు తిరస్కరించకూడదని, అదేవిధంగా సిబ్బంది ప్రవర్తనను పరిశీలిస్తుండాలని సూచించారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత ఎవరినీ హాస్టళ్లలోకి అనుమతించవద్దని ఆదేశించారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, ఎ.భాస్కర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, బీసీ, మైనార్టీ శాఖ అధికారి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

దొంగలను పట్టించిన కుక్కలు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 6: ధాన్యం దొంగతనం చేసేందుకు యత్నించిన దొంగలను కుక్కలు పట్టించాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని తెప్పలమడుగు స్టేజీవద్ద ఉన్న రైస్‌మిల్లులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సాగర్ సీఐ భీసన్న, పెద్దవూర ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... పెద్దవూర మండల పరిధిలోని తెప్పలమడుగు స్టేజీ వద్ద ఉన్న అమ్మ రైస్ మిల్లులో ఎఫ్‌సీఐకి చెందిన ధాన్యాన్ని మూడు లాట్లుగా నిల్వ చేశారు. ఈ నెల 4వ తేదీ ఆదివారం తెల్లవారుజామున నిడమనూరు మండలం నర్సింహులగూడేనికి చెందిన రమేష్, అనుముల మండలం చెల్మరెడ్డిగూడేనికి చెందిన శ్రీకాంత్ తన స్నేహితుడైన శ్రీరాం జీవన్ వద్ద నుంచి ఆటోను అడిగి తీసుకున్నారు. వారు అక్కడి నుంచి నేరుగా తెప్పలమడుగు స్టేజీ వద్ద ఉన్న అమ్మ రైస్‌మిల్లు వద్దకు చేరుకున్నారు. రైస్‌మిల్లు లాట్‌లో ఉన్న ధాన్యం బస్తాలను లాగడంతో రెండు బస్తాలు కిందపడిపోయాయి. అక్కడున్న కుక్కలు మొరగడంతో వాచ్‌మన్ లేచి చూశాడు. ఎన్‌హెచ్-167 పక్కనే ఉన్న ఆ రైస్‌మిల్లు వద్ద రోడ్డుపై ఆటో ఆగి ఉండడాన్ని గమనించాడు. అతను కేకలు వేయడంతో నిందితులు ఆటోను అక్కడే వదిలి పరారయ్యారు. సోమవారం ఉదయం రైస్ మిల్లు యజమాని మలిగిరెడ్డి రామాంజిరెడ్డికి వాచ్‌మన్ సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన ఎస్ఐ రమేష్ ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం అదే రైస్ మిల్లు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. ధాన్యం బస్తాలు దొంగతనం చేసేందుకు వచ్చింది తామేనని ఒప్పుకున్నారు. ఇద్దరు నిందితును మంగళవారం నిడమనూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లి చేతిలో కుమారుడు మృతి


రమేష్(ఫైల్)

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 6 : మద్యం మత్తులో దాడి చేస్తున్న కుమారుడిపైకి తల్లి తిరగబడింది. ఆ దాడిలో కుమారుడు మృతి చెందాడు. సోమవారం రాత్రి నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఈ సంఘటన జరిగింది. సాగర్ సీఐ భీసన్న, ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం సాగర్ పైలాన్‌కాలనీకి చెందిన అవివాహితుడైన సామల రమేష్(45) లారీక్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రమేష్‌కు గతంలోనే తండ్రి చనిపోగా తల్లి బాలమ్మతో పాటు ఇద్దరు చెల్లెలు సుశీల, సునీత ఉన్నారు. రమేష్ రోజూ మద్యం మత్తులో ఇంటికి వచ్చి తల్లితో పాటు చెల్లెళ్లను వేధిస్తుండేవాడు. వారం రోజుల క్రితం లారీక్లీనర్‌గా విధులు ముగించుకుని వచ్చి ఇంట్లో గొడవ చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఉన్న రమేష్ ఇంట్లో నిద్రిస్తున్న తల్లి బాలమ్మ గొంతుపై కాలు పెట్టి తొక్కుతుండగా గమనించిన ఇద్దరు చెల్లెళ్లు అన్నను వారించి లాగగా, వారిని వెనక్కు నెట్టేశాడు. ఈక్రమంలో తేరుకుని పైకి లేచిన తల్లి పక్కనే ఉన్న ఇనుప రాడ్డుతో కుమారుడి తలపై మోదింది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో తల్లి, చెల్లెళ్లు పక్కింట్లో తలదాచుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలి

● కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు ● పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు ● దిష్టిబొమ్మల దహనం

నూతన్‌కల్, ఫిబ్రవరి 6: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బాల్క సుమన్‌పై నూతన్‌కల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళశారం ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రధాన రహదారిపై బాల్క సుమన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మహేశ్వరం చంద్రకళ, తీగల గిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమ, మల్లారెడ్డి, సజ్జన్‌నాయక్, ఎలిమినేటి కృష్ణప్రశాంత్, పసుల అశోక్‌యాదవ్, కళ్లెం కృష్ణారెడ్డి, జటంగి గణేష్ యాదవ్, సైదులు, గుగులోతు కృష్ణ, నాగరాజు, భద్రాచలం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని దూపహాడ్ గ్రామంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదుట బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో కేశవులు, బిట్టు కోటయ్య, సందీప్, కనకయ్య పాల్గొన్నారు.

మద్దిరాల: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మద్దిరాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మమూనూరి ఉపేందర్‌గౌడ్ కోరారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాల్క సుమన్‌పై మద్దిరాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కుమార్‌యాదవ్, మహేందర్, భార్గవ్, పాపయ్య పాల్గొన్నారు.

అర్వపల్లి: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను వెంటనే అరెస్టు చేయాలని బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి కోరారు. బాల్క సుమన్‌పై అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, సిగ నసీర్‌గౌడ్, వేల్పుల రమేష్, రాంబాబు, శ్రీకాంత్, నరేష్, నవీన్ పాల్గొన్నారు.

తిరుమలగిరి: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్ డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలో బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేయడంతో పాటు చెప్పులతో కొట్టారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలని, లేనట్లయితే బయటతిరగనీయబోమని అన్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, కందుకూరి అంబేడ్కర్, జుమ్మీలాల్, జనార్దన్, కౌన్సిలర్లు భాస్కర్, శ్రీను,సోమనర్సయ్య, సుధాకర్, వంశీ, దిలీప్ పాల్గొన్నారు.



తిరుమలగిరిలో బాల్క సుమన్ ఫ్లెక్సీని చెప్పులతో కొడుతున్న కాంగ్రెస్ నాయకులు

తుంగతుర్తి: రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, నాయకులు కొండ రాజు, తిరుమల ప్రగడ కిషన్‌రావు, పెండెం రాంమూర్తి, అజయ్‌కుమార్, రాంబాబు, అనిల్, శంకర్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ అసోసియేషన్ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా తరుణ్‌రెడ్డి



మఠంపల్లి, ఫిబ్రవరి 6: రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన కర్నాటి తరుణ్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు కర్ణం గణేష్, ప్రధాన కార్యదర్శి మంగళపల్లి ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొన్నేళ్లుగా జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా తరుణ్‌రెడ్డి పనిచేస్తున్నారు.

ఉత్తమ్ ఫ్లెక్సీకి జలాభిషేకం

చిలుకూరు, ఫిబ్రవరి 6: సాగు నీటిని విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మహాకూటమి ఆధ్వర్యంలో మంగళవారం కట్టకొమ్ముగూడెంలోని ఆర్‌కే మేజర్ కాల్వలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి చిత్రపటాలకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జానకికృష్ణారావు, మహాకూటమి నాయకులు వేమూరి నాగేశ్వరరావు, కీత వెంకటేశ్వర్లు, సురేష్, అమరగాని సైదులు, షేక్ పాషా, తిపిరిశెట్టి వీరయ్య, వేమూరి శ్రీను, నర్సింహారావు, మట్టయ్య, అప్పారావు, లింగయ్య, రామయ్య పాల్గొన్నారు.

మండల వాసికి పీహెచ్‌డీ

గరిడేపల్లి, ఫిబ్రవరి 6: మండలంలోని గానుగుబండ గ్రామానికి చెందిన తాళ్ల శ్రీనుకు పీహెచ్‌డీ లభించింది. ఉస్మానియా యూనివర్శిటీలో తెలుగు శాఖ విభాగంలో ఆచార్య ఎం.గోనానాయక్ పర్యవేక్షణలో 'బిక్షుకుంట్ల వారి మౌఖిక సాహిత్యం-సంస్కృతి' అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. తెలుగు విభాగంలో జాతీయ స్థాయి ఫెలోషిప్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేశానని శ్రీను తెలిపారు. శ్రీనుకు సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాలి

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 6: పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని మైహోం ఇండస్ట్రీస్ (ప్రై) లిమిటెడ్ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మైహోం పరిశ్రమ, జిల్లా పశువైద్య, పశు సంవర్థకశాఖల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వెంకట్రాంపురం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని జిల్లా పశువైద్యాధికారి ఎస్.శ్రీనివాసరావుతో కలిసి 'మైహోం' ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 250గేదెలు, 400మేకలు, 400ఇతర పెంపు జంతువులకు వ్యాధి నివారణ టీకాలు వేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ఉషారాణి, పరిశ్రమ జీఎం నాగేశ్వరరావు, జగన్నాథరావు, రత్నం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ

కోదాడ టౌన్, ఫిబ్రవరి 6: జాతీయ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలో పట్టణంలోని జయ స్కూల్ విద్యార్థుల ప్రతిభను చాటి 28 బంగారు పతకాలు సాధించారని కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆ పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థులు సీహెచ్ నందు, జైహిందు, యశస్విని, వేదశ్రీ, మోక్షిత, యుక్తశ్రీ, హీరాతన్వీర్, మణికంఠ, శరణ్య, లక్ష్మి, హాసిని, అక్షయ, లోకేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పద్మ, బింగి జ్యోతి, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

నేరేడుచర్ల, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జోన్ అధ్యక్షుడు బట్టు మధు, మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నారాయణ కళాశాలల డీజీఎం దొంతిరెడ్డి వెంకటరమణారెడ్డి సహకారంతో స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.వెంకటప్పయ్య, రామస్వామి, సత్యనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

పీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా మార్చాలి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 6: నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని నేరేడుచర్ల క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకర క్రాంతికుమార్ కోరారు. మంగళవారం నేరేడుచర్లలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి దామోదర రాజనర్సింహ, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన ఉన్నందున నేరేడుచర్ల ఆసుపత్రిని 50పడకల ఆసుపత్రిగా మార్చాలని కోరారు. అదేవిధంగా పెంచికల్‌దిన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సౌకర్యాలను మెరుగుపర్చాలని, నర్సు పోస్టును మంజూరుచేయాలని కోరారు.

నేడు బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

మద్దిరాల, ఫిబ్రవరి 6: తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించే నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు భువనగిరి పార్లమెంట్ ఎన్నికను పురస్కరించుకుని సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. . సమావేశంలో నాయకులు బెజ్జంకి శ్రీరాంరెడ్డి, దుగ్యాల రవీందర్‌రావు, సూరినేని నర్సింహారావు, పాతూరి లింగారెడ్డి పాల్గొన్నారు

కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలి

గరిడేపల్లి, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హులకు అందాలని బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జి చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. 'గావ్ చలో' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని రేగులగడ్డతండాలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ 'నమో' యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి టీచర్లతో మాట్లాడి సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింగ్ అంజయ్య, కుక్కడపు వెంకటేశ్వర్లు, బానోతు చిరంజీవి, తాళ్ల నరేందర్, పొలిశెట్టి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు

ఎంపీడీవో విజయశ్రీ సస్పెన్షన్

కోదాడ రూరల్, ఫిబ్రవరి 6: కోదాడ ఎంపీడీవోగా పనిచేసిన అనుముల విజయశ్రీని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ హనుమంతరావు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కోదాడ ఎంపీడీవోగా విజయశ్రీ పనిచేసిన సమయంలో మాజీ ఎంపీపీ కవితతో కలిసి అనేక అక్రమాలకు పాల్పడ్డారని, మండల పరిషత్ నిధులు రూ.40లక్షలు దుర్వినియోగం చేశారని ఎంపీటీసీలు, జడ్పీటీసీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కలెక్టర్ వెంకట్రావు జిల్లా ఆడిట్ అధికారితో పాటు ఆర్డీవోసూర్యనారాయణను విచారణ అధికారులుగా నియమించారు. వీరిద్దరూ మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులు స్వాధీనం చేసుకుని విచారణ నిర్వహించారు. ఎంపీపీతో కలిసి ఎంపీడీవో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయింది. దీంతో ఆమెపై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు కలెక్టర్ వెంకట్రావు నివేదికను పంపారు. ఈ నివేదిక ఆధారంగా ఎంపీడీవోను సస్పెండ్ చేశారు. విచారణలో మండల పరిషత్ నిధులు రూ.28 లక్షలు ఎంపీడీవో ఎంపీపీతో కలిసి దుర్వినియోగం చేసినట్లు తేలినట్లు సమాచారం. ఎంపీడీవో విజయశ్రీ నాలుగు రోజుల కిందటే కోదాడ నుంచి జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి బదిలీ అయ్యారు.

చిన్నారిని చితకబాదిన టీచర్

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 6: చిన్నారిని టీచర్ కొట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జనగాం క్రాస్ రోడ్డులో నివసిస్తున్న దరావత్ పార్వతి- బాలు దంపతుల కుమారుడు సహాస్ సూర్యాపేటలోని ఓ స్కూల్లో నర్సరీలో ఈ ఏడాదే చేర్పించారు. ఆ చిన్నారిని టీచర్ చితకబాదడంతో తల్లిదండ్రులు పాఠశాలలో యాజమాన్యంతో వాగ్వివాదానికి దిగారు. అనంతరం . సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీచర్‌ను పాఠశాల నుంచి తొలగిస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో కేసును చిన్నారి తల్లిదండ్రులు ఉపసంహరించుకున్నారు.

ఈ పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 6: ఈ పాస్ మిషన్ ద్వారానే డీలర్లు, సహకార సంఘాలు ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని చిమిర్యాల, నల్లబండగూడెం, తొగర్రాయి ప్రాథమిక సహకార సంఘాలను, పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ ప్రవేశపెట్టిన 'ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం' యాప్ ద్వారా ఎరువుల దుకాణాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ పాస్ మిషన్‌లో ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. మండలంలో ఎరువుల కొరత లేదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పాలెం రజిని, సీఈవో కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ రాజీనామా

నేరేడుచర్ల, ఫిబ్రవరి 6: మండలంలోని చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ పదవికి అనంతు శ్రీనివాస్ రాజీనామా చేశాడు. శ్రీనివాస్‌పై గత నెల 30వ తేదీన అవిశ్వాస తీర్మానం పెట్టాగా వీగింది. ఆయన అవినీతి ఆరోపణలు ఉండడంతో విచారణకు కలెక్టర్ ఆదేశించారు. దీంతో శ్రీనివాస్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న ఘంటా రంగారెడ్డికి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా సహకార సంఘం అధికారి శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

చిలుకూరు, ఫిబ్రవరి 6: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ ప్రశాంతి కోటయ్య కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, గ్రామకార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పారిశుధ్య వారోత్సవం సందర్భంగా ఈ నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి రూపేందర్ సింగ్, ఎంపీడీవో ఈదయ్య, ఎంపీవో ఇబ్రహీం, లక్ష్మారెడ్డి, పాల్గొన్నారు.

లేఅవుట్లలో నిబంధన ప్రకారం వసతులు కల్పించాలి

తిరుమలగిరి, ఫిబ్రవరి 6: లేఅవుట్లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని వసతులు కల్పించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్ కోరారు. మంగళవారం తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని పలు లేఅవుట్లను టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి ఆమె తనిఖీ చేశారు. లేఅవుట్లలో డ్రైనేజీ, విద్యుత్, మంచినీటి వసతులను పూర్తిచేయాలన్నారు. అలసత్వం వహిస్తే అనుమతులను రద్దుచేస్తామని హెచ్చరించారు. వసతులను పరిశీలించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆరు గ్యారెంటీల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఆత్మకూర్(ఎస్), ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల్లో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకుడు తిప్పర్తి భిక్షం డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మక్తాకొత్తగూడెం గ్రామంలో నిర్వహించిన ఆ సంఘం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీ బస్సులలో మహిళలతో పాటు దివ్యాంగ పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. దివ్యాంగులకు ప్రభుత్వం రూ.6వేల పింఛన్ ఇవ్వాలని, గృహలక్ష్మి పథకంలో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కోట వెంకన్న, తిప్పర్తి పెద్ద భిక్షం, హేమలత పాల్గొన్నారు.

అభివృద్ధిలో పేట మునిసిపాలిటీ భేష్



పేట మునిసిపాలిటీని సందర్శించిన షాద్‌నగర్ మునిసిపల్ చైర్మన్ కొందూరి నరేందర్, కౌన్సిలర్లు

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 6: సూర్యాపేట మునిసిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందిందని షాద్‌నగర్ మునిసిపల్ చైర్మన్ కొందూరి నరేందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు అభివృద్ధి పనులను షాద్‌నగర్ కౌన్సిలర్లతో కలసి పరిశీలించారు. వ్యర్థాలతో ఇటుకలు, కంపోస్టు ఎరువుల తయారీతో మునిసిపాలిటీకి ఆదాయం రావడం అభినందనీయమన్నారు. విశాలమైన ప్రదేశంలో చుట్టూ పార్కు, చెట్ల మధ్యలో ఏర్పాటు చేసిన మహాప్రస్థానం సుందరంగా ఉందన్నారు. అనంతరం జమునానగర్‌లో ఉన్న ఘన వ్యర్థాల ప్లాంట్‌ను సందర్శించి పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి తయారు చేసే బ్రిక్స్, ప్లాస్టిక్ మ్యాట్‌లు పరిశీలించారు సద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న బోటింగ్ చేశారు. కార్యక్రమంలో సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు మునిసిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి, షాద్‌నగర్ మునిసిపల్ కమిషనర్ చామ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, సతీష్, ఆర్ఐ శివ రాంరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎస్ఎస్ఆర్ ప్రసాద్, ఇంజనీర్ శివప్రసాద్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ పేరుతో మోసం

● కుటుంబం సహా పరారైన నిందితుడు
● ఎస్పీకి ఫిర్యాదు చేసిన పలువురు బాధితులు

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 6: ఇన్సూరెన్స్‌కు రూ.లక్ష చెల్లిస్తే ఏడాదికి రూ.15లక్షలు వస్తాయని ఓ వ్యక్తి నమ్మించి మోసం చేశాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఓ ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధినని ప్రచారం చేసుకున్నారు. మృతి చెందినవారి పేరిట ఇన్సూరెన్సు పాలసీ కొనుగోలు చేస్తే కొన్ని రెట్లు అధికంగా డబ్బులిస్తాయని నమ్మబలికాడు. గ్రామాల వారీగా ఏజంట్లను నియమించుకుని 20శాతం కమీషన్ కూడా ఇచ్చాడు. దీంతో సూర్యాపేట జిల్లాతో పాటు మహబూబాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట తదితర ప్రాంతాల ప్రజలు ఒకొక్కరు రూ.50వేల నుంచి రూ.15లక్షల వరకు చెల్లించారు. ఇలా కోట్లాది రూపాయలు సేకరించి, గడువు ముగిసినా డబ్బులు తిరిగి చెల్లించనందున పలువురు అతని ఇంటికి వెళ్లి నిలదీయగా కొంతమందికి బ్లాంక్ చెక్కులు ఇవ్వడంతో పాటు ప్రామిసరీ నోట్లు రాసిచ్చాడు. బాధితుల నుంచి ఒత్తిడి ఎక్కువైనందున కుటుంబం సహా గ్రామం విడిచి పరారైనట్లు సమాచారం. ఇన్సూరెన్స్ పేరుతో వసూలు చేసిన డబ్బులతో ఖరీదైన కార్లు, వెండి, బంగారు ఆభరణాలు, కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట విలువైన స్థలాలు కొనుగోలు చేశాడని బాధితులు చెబుతున్నారు. ఈ ఉదంతంపై గరిడేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాధితుడు ఎస్పీ రాహెల్‌హెగ్డే బీకేకు ఇటీవల ఫిర్యాదు చేశాడు. మోసపోయినవారిలో ఎక్కువగా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారు. దీంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దంపతులు ప్రత్యేక చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

జోరుగా రంగు కలిపిన జొన్నల దందా

● పచ్చ జొన్నలని సాగు చేస్తే కాసిన తెల్ల కంకులు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 6: హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని తెల్ల జొన్నలకు పచ్చ రంగు వేసి విక్రయించే దందా సాగుతోంది. చాలా మంది రాత్రి వేళ జొన్న రొట్టెలను ఆహారంగా తీసుకుంటున్నందున పచ్చ జొన్నలకు గిరాకీ పెరిగింది. ఇదే అదునుగా కొంత మంది వ్యాపారులు కిలో రూ.20లకు లభించే తెల్లజొన్నలకు పచ్చరంగు వేసి కిలో రూ.65నుంచి రూ.70కి విక్రయిస్తున్నారు. మెట్ట ప్రాంత రైతులు రెండో పంటగా డిసెంబరు, జనవరి మాసాల్లో పచ్చజొన్నను సాగుచేశారు. రంగు వేసిన పచ్చజొన్నలను ఓ వ్యాపారి పలువురు రైతులకు విక్రయించారు. తెల్లకంకులు కాపుగాశాయి. దీంతో మోసపోయామని గ్రహించిన రైతులు, వ్యాపారి దుకాణం ఎదుట ఇటీవల నిరసన తెలపడంతో ఈ దందా వెలుగులోకి వచ్చింది. ఇది కేవలం రైతులు నష్టపోయిన విషయం కాదని, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనుందని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. సంద్యాల కేంద్రంగా ఈ దందా సాగుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో సమాచారం లభించిందన్నారు.. కిరాణా దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేయొద్దని, లైసెన్సు ఉన్నా డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని ఏవో శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

నల్ల బెల్లం, పటిక స్వాధీనం: ఆరుగురిపై కేసు

నూతనకల్, ఫిబ్రవరి 6: అక్రమంగా తరలిస్తున్న నల్ల బెల్లాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ చలిగంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. లారీ, ఆటోలో నల్లబెల్లం, పటికను తరలిస్తుండగా మండలంలోని బిక్కుమళ్ల గ్రామ శివారులో మంగళవారం పట్టుకున్నారు. 130బస్తాల బెల్లం, 10బ్యాగుల పటికను స్వాధీనం చేసుకున్నారు. నల్ల బెల్లం, పటికను తరలిస్తున్న సుంకరబోయిన లింగయ్య, గుండా శ్రీనివాస్, పాగాల తిరుపతి, పాతులోతు రెడ్యా, పాతులోతు శ్రీకాంత్, పాతులోతు పంతుల్యాపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

తూర్పుగూడెంలో దొంగల బీభత్సం

ఒకే రోజు ఆరు ఇళ్లలో చోరీ

తుంగతుర్తి, ఫిబ్రవరి 6: మండలంలో రోజురోజుకు దొంగతనాలు ఎక్కువవుతున్నాయి. నెల రోజుల క్రితం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణంలో జరిగిన చోరీ ఘటనను మరవక ముందే తూర్పుగూడెంలో సోమవారం రాత్రి పలు ఇళ్లలో దొంగలు చోరీ చేశారు. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంకినేని రామచంద్రరావు ఇంట్లో దొంగలు పడి ఆరు గ్రాముల బంగారు దిద్దులు, కిలో వెండి ఆభరణాలు, రూ.10వేలు చోరీ చేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన పునగంటి కమలమ్మ ముత్యం కాంతమ్మ, అజారి జగ్గయ్య, గట్టు జగదాంబ, లింగంపల్లి కమలమ్మల ఇంట్లో చోరీ చేశారు. దొంగలు మొత్తం తులం బంగారం, ఒక కేజీ 700గ్రాముల వెండి, రూ.20వేలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అనంతగిరి, పెన్‌పహాడ్, ఫిబ్రవరి 6: అనంతగిరి, పెన్‌పహాడ్ మండలాల్లో మంగళవారం మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. అనంతగిరి ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలేరు వాగు నుంచి కోదాడకు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట శివారులోని మున్నేరు వాగు నుంచి గోండ్రియాల గ్రామం మీదుగా కోదాడకు తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గోండ్రియాల గ్రామ శివారులో పట్టుకున్నారు. ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్లు నెల్లూరి నరేష్, రేకల వెంకటరమణ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● పెన్‌పహాడ్ మండలం నాగులపహాడ్ గ్రామంలో మూసీ నది నుంచి నారాయణగూడెం గ్రామానికి ట్రాక్టర్‌లో ఇసుకను ఒక వ్యక్తి తరలిస్తుండగా.. అన్నారంబ్రిడ్జి వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ పెరక రవీందర్ తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



సూర్యాపేట(కలెక్టరేట్): జిల్లా కేంద్రంలోని కుడకుడలో సర్వే నెం.126 ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏవో సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కారింగుల వెంకన్న, రేణుక, పాల్గొన్నారు.

సూర్యాపేట సిటీ: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో దడువాయిల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం పట్టణ అధ్యక్షుడిగా నూకల మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రేగటి సందీప్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎల్గూరి శ్రీనివాస్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా పొదిల లింగస్వామి, కోశాధికారిగా అరిగె శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నీరుడు వెంకటరత్నం, సభ్యులుగా మరో ఎనిమిది మందిని ఎన్నుకున్నారు.

సూర్యాపేటఅర్బన్: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పట్టణ ఎస్ఐ యాకుబ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌లో ఉన్న జయపాఠశాల విద్యార్థులకు షీటీమ్స్, సైబర్ నేరాలపై నిర్వహించి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో షీటీమ్ ఏఎస్ఐ పాండునాయక్, హెడ్ కానిస్టేబుల్ ఎల్లారెడ్డి, శివరాం, పాఠశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్ పాల్గొన్నారు.

● జిల్లాలో ఐదో రోజు ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాం తంగా జరిగాయి. జిల్లాలో 42 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు.

పెన్‌పహాడ్: రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎస్ఐ పెరక రవీందర్ అన్నారు. మండలంలోని దూపహాడ్ గ్రామంలో ఆయన మాట్లాడారు అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు అత్తి కేశవులు, మల్లెపల్లి కరుణాకర్, దొంగరి సైదులు, పిన్నాని సందీప్, పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటరమణ అన్నారు. పట్టణంలో ఇటీవల నిర్వహించిన పాఠశాలల డివిజన్ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. కోకో, చెస్, క్యారమ్స్ పోటీలలో విద్యార్థులు మొదటి బహుమతి సాధించారు. కార్యక్రమంలో ప్రేమ్‌సాగర్, శ్రీనివాసరెడ్డి, అనిల్‌కుమార్, రామకృష్ణారెడ్డి, ప్రియాంక పాల్గొన్నారు.

● రైస్‌మిల్లు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్యగౌడ్ కోరారు. హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించిన రైస్‌మిల్లు డ్రైవర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 16న దేశ వ్యాప్తంగా కార్మికులు నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాము పాల్గొన్నారు.

●హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారంలో నూతనంగా నిర్మించనున్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడివెండి వెంకటాచారి, గౌరవ అధ్యక్షులుగా దేవరకొండ శంభయ్యచారి, చేపూరి నర్సింహాచారి, ధర్మూరి వెంకటేశ్వర్లు, పిచ్చయ్యచారి, శ్రీనివాసచారి, అమరయ్యచారి, ఉపాధ్యక్షులుగా పరిపూర్ణచారి, వీరనరేష్, నర్సింహాచారి, ప్రధానకార్యదర్శిగా ఎస్.వెంకటాచారి, కోశాధికారిగా నర్సయ్యను ఎన్నుకున్నారు.

● హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. కార్యక్రమంలో యరగాని రామస్వామి, యల్లమ్మ, ఈఓ లక్ష్మణ్‌రావు, యరగాని కిరణ్, అశోక్ పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ పట్టణంలోని ఈ నెల 23వ తేదీ నుంచి 27వరకు నిర్వహించే శ్రీవేణుగోపాల-శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఫణిగిరి గట్టు వద్ద కొబ్బరికాయల విక్రయం, తైబజార్‌కు సంబంధించి ఈనెల ఏడో తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా డిపాజిట్‌గా రూ.10వేలు చెల్లించాలన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో లక్ష్మీనృసింహుని కల్యాణాన్ని మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: ఆశా కార్యకర్తలను పర్మినెంట్ చేసి, నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని, బోనస్, పీఎఫ్ వంటి సౌకర్యాలను కల్పించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు కోరారు. మేళ్లచెర్వు మండల కేంద్రంలో 60మంది ఆశా వర్కర్లు సీఐటీయూలో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 16న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

కోదాడ టౌన్: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని దాతలు కోదాడ మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్తిబాబు, నారాయణరావు, కొల్లు వీరయ్య ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని దాతలతో కలిసి ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో జూకూరి అంజయ్య, కోట తిరుపతయ్య పాల్గొన్నారు.

మునగాల రూరల్: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి అన్నారు. మండలంలోని నర్సింహులగూడెం జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన నందిపాటి శేఖర్ సహకారంతో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపి, పాల్గొన్నారు.

తుంగతుర్తి: నూతన్‌కల్‌లో ఈనెల 8వ తేదీన నిర్వహించే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్క్ సభలను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు కోరారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటల ఫలితంగా సాధించుకున్న ఉపాధిహామీ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పులుసు సత్యం, గుర్రం శ్రీను, ముత్తయ్య పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండల కేంద్రంలో ఈ నెల 8వ తేదీన నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి వర్క్ షాప్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముల్కలపల్లి రాములు, మట్టిపల్లి లింగయ్య కోరారు. మండలంలోని చిల్పకుంట్ల గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో పులుసు సత్యం,శంకర్‌రెడ్డి, వెంకటముత్యం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తుంగతుర్తి, తిరుమలగిరి: ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల్ అధికారి పెండెం వెంకటరమణ, తిరుమలగిరి డాక్టర్ మల్లెల వందన కోరారు. తుంగతుర్తిలో వెంకటరమణ, తిరుమలగిరి సీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ప్రభుత్వ ప్రైవేటు టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వందన మాట్లాడారు.

తిరుమలగిరి: 'సంకల్ప్' పథకాన్ని ఎస్సీ, ఎస్టీ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి మాధవరెడ్డి కోరారు. మంగళవారం తిరుమలగిరిలో నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు.యువత స్వశక్తితో ఎదగాలన్నారు. కార్యక్రమంలో సయ్యద్ అబ్దుల్ ఖాదర్, సునీల్, శశికాంత్ పాల్గొన్నారు.